ప్రజాశక్తి

గురువారం 22 మే 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ఎంపి నిధులకు అడ్డుచక్రం



- వైసిపి బాటలోనే కూటమి నేతలు
- నిధులు కేటాయించినా పనులు నిలిపివేత
- ఖజానాలో మూలుగుతున్న రూ.12 కోట్లు
- రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి నిస్సహాయత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి తన ఎంపి నిధులను ఖర్చు చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అన్నట్లుగా గతంలో వైసిపి అధికారంలో ఉండగా అప్పటి టిడిపి ఎంపి గల్లా జయదేవ్ నిధులతో జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఇవ్వగా అప్పట్లో ఈ పనులు చేసేందుకు జిల్లాలోని పలువురు వైసిపి ఎమ్మెల్యేలు అడ్డుపడ్డారు. ఇదే రీతిలో ఇప్పుడు వైసిపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి నిధులను ఖర్చుచేసేందుకు అధికారులకు ప్రతిపాదనలు ఇవ్వగా టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులు అడ్డుపడుతున్నారు. దీంతో ఆయన గతేడాది కాలంగా కేంద్ర ప్రభుత్వం తనకు ఇచ్చిన ఎంపి ల్యాడ్స్ నిధులను ఖర్చు చేయలేకపోతున్నారు. ఆయన సహాయకులు కింది స్థాయి అధికారులను సంప్రదిస్తున్నారు. సార్... అధికార పార్టీ వారు ఈ పనులను చేయవద్దని చెబుతున్నారు. అందువల్ల తాము ఏమీ చేయలేకపోతున్నా'మని క్షేత్రస్థాయి అధికారులు సమాధానం చెబుతున్నారు.

ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.5 కోట్లు నిధులు కేటాయిస్తుంది. నియోజకవర్గంలో ఎక్కడైనా అభివృద్ధి పనులకు ఈ నిధులను వినియోగించుకోవచ్చు. లోక్‌సభ సభ్యులు అయితే వారి నియోజకవర్గం పరిధిలో ఖర్చు చేయాలి. రాజ్యసభ సభ్యులైతే వారు ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తే ఈ రాష్ట్రంలో ఖర్చు చేయవచ్చు. 2020లో రాజ్యసభకు ఎన్నికైన ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి వైసిపి హయాంలో నాలుగేళ్లపాటు తన నిధులను ఎక్కువగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఖర్చు చేశారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలో ఆయన ఎక్కువ కేటాయింపులు చేశారు. 2023-24 వరకు ఆయన ప్రతిపాదనల మేరకు దాదాపు రూ.15 కోట్లతో నిధులు ఖర్చు చేశారు. 2024-25 నుంచి ఆయన నిధుల వినియోగంపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.5 కోట్లలో దాదాపు రూ.2 కోట్లకు ప్రతిపాదనలివ్వగా కూటమి పార్టీల నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఆయన మిగతా రూ.3 కోట్లకు కూడా ప్రతిపాదనలు ఇవ్వలేదు. తమ అనుమతి లేకుండా వైసిపి ప్రజా ప్రతినిధి సొమ్ముతో తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలులేదని వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులకు టిడిపి నాయకులు హుకుం జారీ చేశారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యేలు కూడా ఆయా శాఖల అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఏడాది కాలంగా నిధులు ఉన్నా ఖర్చుచేయలేని స్థితిలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి చూస్తుండిపోయారు.

2025-26 ఆర్థిక సంవత్సరంలోకూడా మరో రూ.5 కోట్ల ప్రతిపాదనలు ఇవ్వడానికి సిద్ధపడినా టిడిపి వారు అనుమతివ్వనిదే తామేమీ చేయలేమని అధికారులు స్పష్టం చేయడంతో ఆయన ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదనలు ఇవ్వడం లేదని తెలిసింది. రెండేళ్లలో రూ.10 కోట్లతో ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులు చేయలేక నిధులు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. 2023-24లో పెండింగ్‌లో ఉన్న దాదాపు మరోరూ.2 కోట్ల పనులు కూడా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిలిచిపోయాయి. మొత్తంగా నిధులు ఉన్నా అభివృద్ధి పనులు జరగని విచిత్ర పరిస్థితి కూటమి ప్రభుత్వంలో కూడా పునరావృతమైంది.

దోలాయమానంలో ఎమ్‌డియు నిర్వాహకులు

19 నెలలు మిగిలి ఉండగానే నిలిపివేతపై ఇన్‌ఛార్జి కలెక్టరుకు వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చేనెల ఒకటో తేదీనుంచి రేషన్ పంపిణీని ఎమ్‌డియు వాహనదారుల నుంచి కాకుండా గతంలో ఉన్న చౌక డిపోల నుంచి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లాలో 1800 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి లేకుండా పోయింది. ఒక్కో వాహనంపై ఇద్దరు పనిచేస్తున్నారు. ఎటువంటి నోటీసులూ లేకుండా ఉన్న పళంగా తమ వాహనదానుల నిలిపివేయడంపై ఎమ్‌డియు నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయం చూపకుండా ఏకపక్షంగా వాహనాలను నిలిపివేయడం తగదని వాహనదారుల అసోసియేషన్ అధ్యక్షులు షేక్ మహబూబ్ బాష, వైస్ ప్రసిడెంట్ బచ్చనబోయిన తిరుపతి రామయ్య చెప్పారు. తమకు ఇంకా 19 నెలల సమయం ఉందని, ఈ మేరకు ఈ సమయాన్ని కొనసాగించాలని వారు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. 2021 నుంచి రేషన్‌ను తాము అందిస్తున్నామని, కొన్నిచోట్ల పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకోవాలే తప్ప మూకుమ్మడిగా తొలగించడం సరికాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 901 వాహనాలు ఉండగా ఒక్కో వాహనానికి నెలకు రూ.18 వేలు ఇఎంఐ చెల్లించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వంతో వాహనారులకు ఆరేళ్ల పాటు పనిచేసేలా ఒప్పందం ఉందని, బుడమేరు వరదల పమయలో తమ వాహనాలలోనే రేషన్ సరుకులు రవాణా చేశామని చెప్పారు. ఒక్కో వాహనంపై ఇద్దరు పనిచేస్తున్నారని, దాదాపు 1800 కుటుంబాల వారు పనులులేక వీధిన పడతారని వివరించారు. ఆరేళ్ల కాలపరిమితి పూర్తయితే వాహనాల వినియోగంపై ఆంక్షలు పోతాయని, వాహనాలకు తాము ఇంకా దాదాపు బ్యాంకులకు రూ.3.24 లక్షలు చెల్లించాల్సి ఉన్న దశలో ఈ సొమ్ము ఎలా చెల్లిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

శక్తి సదన్‌లతో మహిళలకు భరోసా

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

గుంటూరు శక్తి సదన్‌ను పరిశీలిస్తున్న రాయపాటి శైలజ

వార్త మెయిన్‌లో

షైనింగ్ స్టార్ సమీరా

మంత్రి లోకేష్ నుండి అవార్డును అందుకున్న జెడ్‌పి పాఠశాల విద్యార్థిని

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచిన షేక్ సమీరా వల్ల జెడ్‌పి బాలికల పాఠశాల కీర్తి పెరిగిందని హెచ్‌ఎం షేక్ షకీనా అన్నారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో సమీరా 596/600 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాల గౌరవమూ పెంచిన సందర్భంగా సిఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రి లోకేష్ సమీరాకు షైనింగ్ స్టార్‌గా ఆవార్డును అందించి సన్మానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆయా స్కూల్స్‌లో మౌలిక వసతులు, బోధనా ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇంకా ఏ సదుపాయాలు కల్పిస్తే బాగుంటుందని మీరు అనుకుంటున్నారు.. అని పిల్లల నుంచి అభిప్రాయం అడిగి తెలుసుకుని మంత్రి లోకేష్ నోట్ చేసుకున్నట్లు వివరించారు. అవార్డ్ గ్రహీత సమీరాను స్థానిక గర్ల్స్ హైస్కూల్ హెచ్‌ఎం షేక్ షకీనా, క్లాస్ టీచర్ ఉష, కృష్ణారెడ్డి, ఎస్‌విఎస్ నాగరాజు, రత్నం, బాలనాగమ్మ, ఆయేషా సుల్తానా అభినందించారు.

రేషన్ పంపిణీలో ఇబ్బందులు రానివ్వొద్దు

ప్రజాశక్తి - గుంటూరు

రేషన్ సరఫరా, కార్డుల దరఖాస్తు అంశాలపై జాయింట్ కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా గుంటూరు జిల్లా నుండి జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, జిల్లా పౌర సరఫరాల అధికారి కోమలి పద్మ , జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ఎమ్‌డియు వాహనాల ద్వారా రేషన్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్న దృష్ట్యా వచ్చేనెల ఒకటో తేదీ నుండి సరుకులను రేషన్ దుకాణాల ద్వారానే పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. 65 ఏళ్ల దాటిన వారికి, వికలాంగులకు మాత్రం ఇళ్ల వద్దకు పంపిణీ చేయాలని చెప్పారు. రేషన్ పంపిణీలో లబ్ధిదార్లకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. రేషన్ కార్డులు దాఖలు చేసే ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి కొంత వెసులుబాటును కల్పిస్తామని చెప్పారు.

మూడు వంతెనల వద్ద నిలిచిన వర్షపు నీరు

గుంటూరులో భారీ వర్షం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అల్పపీడన ద్రోణి వల్ల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వేసవిలో వర్షాలతో ఈ ఏడాది ఎండ తీవ్రత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. బుధవారం జిల్లాలోని పలుప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుంటూరులో బుధవారం సాయంత్రం భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీటితోపాటు మురుగునీరు చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రస్తుత వర్షాలకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు సమస్య లేకుండా నగరపాలక సంస్థ ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను నగర కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం సాయంత్రం వర్షానికి నీరు నిలిచిన 3 వంతెనలు, మెడికల్ కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో నీటిని తక్షణం తొలగించినట్టు కమిషనర్ తెలిపారు. వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రిజర్వాయర్ల వారీగా తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా తగు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఇంజినీరింగ్ సిబ్బందికి చెప్పారు. గాలులకు హోర్డింగ్స్ కూలకుండా చూడాలని, ఎక్కడైనా కూలితే వెంటనే తొలగించాలని ఆదేశించారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని సిపిఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు అన్నారు. రొంపిచర్లలో బుధవారం నిర్వహించిన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నైరుతి రుతుపవనాల నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు రావడం పొలాలు చదును కావడంతో రైతులు దుక్కి దున్ని, సాగుకు సిద్ధమవుతున్నారని, ఈ తరుణంలో రైతుసేవా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి పంటలకు మద్దతు ధరలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామశాఖ కార్యదర్శిగా ముప్పూరి మధుసూదనరావును ఎన్నుకున్నారు. నాయకులు మోహనరావు, హుస్సేన్, సుభానీ, నాగూర్, సాంబశివరావు పాల్గొన్నారు.

సోషల్ మీడియా దుష్ప్రభావాలపై 'నా శత్రువు'

రెండోరోజూ అలరించిన నాటిక ప్రదర్శనలు

కళాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న జీవీ ఆంజనేయులు తదితరులు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని గోనుగుంట్ల సత్యనారాయణ, మక్కెన చినరామయ్య కళా ప్రాంగణంలో ప్రదర్శిస్తున్న నందమూరి తారక రామారావు కళాపరిషత్ నాటకోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం రాత్రి ప్రదర్శనలను జనసేన నియోజకవర్గ బాధ్యులు కొంజేటి నాగశ్రీను, జిల్లా కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు ప్రారంభించారు. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావాలపై అక్కల తామేశ్వరరావు రచించిన 'నా శత్రువు' నాటికను వడ్డాది సత్యనారాయణ దర్శకత్వంలో యువభేరి థియేటర్స్ హైదరాబాదు వారు ప్రదర్శించారు. 'సామాజిక మాధ్యమాలకు బానిస కావద్దు. వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను అవసరం మేరకే వినియోగిస్తే నష్టం లేదు. అలా కాకుండా 24 గంటలు వాటిలో మునిగి సంసారాన్ని నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే పరిణామాల'ను కంటికి కంటినట్లు కళాకారులు ప్రదర్శించారు.

వ్యవసాయదారులను చిన్నచూపు చూస్తున్నారనే ఇతివృత్తంగా మద్దుకూరి రవీంద్ర రచించిన 'మా ఇంట్లో మహాభారతం' నాటికను నడింపల్లి వెంకటేశ్వర్లు దర్శకత్వంలో మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట కళాకారులు ప్రదర్శించగా ప్రేక్షకుల నుండి హర్షధ్వానాలు వచ్చాయి. '25 ఎకరాల పొలం ఉండి వ్యవసాయం చేస్తున్న యువకులకు పెళ్లిళ్లు కావడం కష్టంగా ఉంది. రూ.10 వేల జీతంలో పట్టణంలో ఉద్యోగం చేస్తున్న వారినైనా వివాహం చేసుకోవడానికైనా ముందుకొస్తున్నారు గాని వ్యవసాయం చేస్తున్న వారికి పెళ్లి కష్టంగా ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు పండించే వారుండరు. బస్తా డబ్బులిచ్చినా తిండి గింజలు కొనలేని పరిస్థితి వస్తుంది' అనే సందేశంతో నాటిక ప్రదర్శన సాగింది. అనంతరం హైదరాబాద్ సిరిమువ్వ కల్చరర్ వారు 'హక్కు' నాటికను ప్రదర్శించారు.

ప్రదర్శనలకు పొట్ల రాధాకృష్ణమూర్తి, పారా లక్ష్మయ్య, మాదినేని ఆంజనేయులు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు అతిథులుగా హాజరై ప్రదర్శనలను చూశారు. కళాపరిషత్ అధ్యక్షులు న్యాయవాది రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ముత్తినేని గిరిబాబు, మాజీ ఎంపిపి బొల్లా వెంకట కోటయ్య, లగడపాటి వెంకట్రావు, మంద మరియబాబు, గాలి రేవతి శ్రీనివాసరావు, పెనుగొండ శ్రీనివాసరావు, లాయర్ సైదారావు, కౌన్సిలర్ దస్తగిరి షకీలా, వాసిరెడ్డి లింగమూర్తి, టిడిపి నాయకులు పీవీ సురేష్‌బాబు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలలో 265 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 23 కంపెనీల ప్రతినిధులు ఎంపికలు చేపట్టగా 675 మంది హాజరయ్యారు. వీరిలో 265 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. వృత్తి పరమైన నైపుణ్యాలను, మెలకువలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ యువత మరిన్ని ఉన్నత శిఖరాలను అందుకునేలా విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజిరావు, అదనపు అధికారి రామాంజనేయులు, డిఆర్‌డిఎ పీడీ ఝాన్సీరాణి, మెప్మా పీడీ విజయలక్ష్మి, జెఇఒ రమాదేవి పాల్గొన్నారు.

టిడిపి మహానాడులో పలు తీర్మానాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం భువనచంద్ర టౌన్ హాల్‌లో పల్నాడు జిల్లా స్థాయి మినీ మహానాడును టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ 27, 28, 29 తేదీలలో కడపలో జరగనున్న మహానాడుకు జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలని కోరారు. ప్రభుత్వ ఛీఫ్ విప్ జివి. ఆంజనేయులు మాట్లాడుతూ ఓట్లేసి గెలిపించిన కార్యకర్తలు, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ టిడిపి కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలు బాగుంటే పార్టీకి ఢోకా లేదని అన్నారు. రాష్ట్ర సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి వాటిని పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పారు. ఎమ్మెల్యేలు అరవిందబాబు, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్య ప్రవీణ్ మాట్లాడుతూ 2047 వరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు. అనంతరం వరికపుడిశెల ప్రాజెక్టు పూర్తి చేయాలని,నరసరావుపేట చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు, ఇండస్ట్రియల్ పార్క్, శిల్పారామం, స్టార్ హోటల్, ట్రక్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానం చేశారు. మక్కెన మల్లికార్జునరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాగసరపు సుబ్బరాయ గుప్తా పాల్గొన్నారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు.

మహారాజ శ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)వారి కోర్టులో
E P NO: 35/ 2023 / O.S NO: 513 of 2021
బిట్వీన్
పొన్నెకంటి మల్లేశ్వర రావు, ... డి.హెచ్.ఆర్
VS
మందడపు రామచంద్రయ్య .... జె డి ఆర్
To
మందడపు రామచంద్రయ్య తండ్రి : రామలింగయ్య, వయసు 58 సంవత్సరాలు, మిట్టపాలెం గ్రామం అచ్చంపేట మండలం పల్నాడు జిల్లా.
పై నెంబరు గల దావా లో శ్రీ కోర్టు వారు మీ యొక్క హాజరు నిమిత్తము ది 16-06-2025 వ తేదీకి వాయిదా వేసియున్నారు.కావున వాయిదా తేదీన పై తెలిపిన కోర్టు లో ఉదయం 10.30 ని:లకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరయి మి యొక్క ఆక్షేపణలు తెలుపు కోవలయును.లేనిచో మీ పై పరోక్షముగా తీర్మానించబడుననీ ఇందు మూలముగా తెలియ జేయడమైనది.
కోర్టు వారి ఉత్తర్వులమేరకు
వాయిదా తేదీ. 16-06-2025
శ్రీ బి.ఎల్. చిన్నయ్య,
వాది తరుపు న్యాయవాది,
సత్తెనపల్లి.
సెల్ :9848771757

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా నాక్లయింటు అయిన పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం, నరసరావుపేట పట్టణ నివాసి అయిన వంకాయలపాటి శ్రీకాంత్ చౌదరి, తండ్రి హనుమంతరావు నుండి సమాచారం పొంది ఇందుమూలంగా తెలియుజేయునది ఏమనగా :
నా క్లయింటు ఇటీవల తెలిసినది ఏమనగా వంకాయలపాటి హనుమంతరావు, తండ్రి పెద్ద సుబ్బయ్య గారు నాక్లయింటుకు మరియు ఇంట్లో వారికి తెలియకుండా బాకీలు చేయుచున్నారనీన్నీ, అలా తీసుకున్న డబ్బును దుబారాగా ఖర్చు చేయుచున్నారనీన్నీ, ఆ మేరకు నా క్లయింటు మరియు నా క్లయింటు సోదరి అయిన తొండెపు రాధిక గారు ఇరువురు కలిసి ఎన్నిసార్లు పద్ధతి మార్చుకోమని చెప్పినన్నూ, సదరు వంకాయలపాటి హనుమంతరావు గారు పద్ధతి మార్చుకోకుండా అలానే వ్యవహరిస్తున్నారనీన్నీ, గతంలో ఎన్నోబాకీలు నా క్లయింటు తీర్చియున్నారనీన్నీ, అయినన్నూ సదరు వంకాయలపాటి హనుమంతరావు గారు ఇంకా అప్పులు చేస్తూ నాక్లయింటును ఇబ్బందులకు గురిచేస్తున్నారనీన్నీ, సదరు వంకాయలపాటి హనుమంతరావు గారు ఇక భవిష్యత్తులో ఎటువంటి బాకీలు చేసిన అందుకు నాక్లయింటుగానీ మరియు నాక్లయింటు సోదరి అయిన తొండెపు రాధికకు ఎటువంటి సంబంధం లేదనీన్నీ, అంతేకాకుండా సదరు వంకాయలపాటి హనుమంత రావు గారు ఏమి చేసిన నా క్లయింటు మరియు నా క్లయింటు సోదరి అయిన తొండెపు రాధికకు ఎటువంటి సంబంధం లేదనీన్నీ, అందుకు భిన్నంగా ఎవరైన వ్యవహరించి నన్నూ, అటువంటి వారిపై నాక్లయింటు చట్టపరంగా చర్యలు తీసుకునేం దుకు సిద్ధంగా ఉన్నారని ఇందు మూలంగా తెలియపరచడమైనది.
తేది: 21.05.2025.
నల్లిబోయిన ఆంజనేయులు,
న్యాయవాది,
సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.

చిన్నపాటి వర్షాలకే రహదారులపైకి మురుగు నీరు

మున్సిపల్ అధికారుల పనితీరుపై ప్రజాగ్రహం

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల టౌన్‌లో చిన్న పాటి వర్షాలకు రహదారులపైకి వర్షపు నీరు, మురుగునీరు రావటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక పెద్ద వర్షం వస్తే మా పరిస్థితి ఏంటని ప్రజలు భయపడుతున్నారు. మున్సిపల్ అధికారుల పనితీరుపై ప్రజలు మండి పడుతున్నారు. కాలువల్లోని మురుగు తొలగించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటంలో మున్సిపల్ అధికారులకు అలసత్వం ఎందుకు అని నిలదీస్తున్నారు. మాచర్ల పట్టణంలోని వివిధ వార్డుల్లో, నెహ్రూనగర్ ప్రధాన రహదారి పైకి చిన్న, చిన్న వర్షాలకు రహదాలుపైకి మురుగునీరు ప్రతి సారి వస్తుంటుంది. లక్షల రుపాయల ఆదాయం కోట్లకు పెరిగినా అవసరమైన సిబ్బంది ఉన్నా ఎందుకు తమకు ఈ దుస్థితి అంటు ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న సిబ్బందిని వార్డుల వారిగా విభజించటం వలన పనులు సక్రమంగా కావటం లేదని ప్రజలకు అవసరమైన సేవలు అందటం లేదని ప్రజా అభిప్రాయంగా ఉంది. ఉన్న సిబ్బందితో గ్యాంగ్ వర్క్ ద్వారా మురుగు కాలువల్లో అడుగు కనిపించేలా కాలువల్లో పూడిక తొలగిస్తే తమకు మేలు జరుగుతుందని ప్రజలు తెలుపుతున్నారు. అయితే పాలకవర్గం మాత్రం కాలవల్లో పూడిక తీసేందుకు కాకుండా, నూతన రహదారులు, మురుగు కాలవలను నిర్మిస్తే బాగుంటుందని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది. నూతన రహదారులు, మురుగు కాలువలు ఏర్పాటు చేసినా తదుపరి కాలవల్లో సక్రమంగా పూడిక తీయించకపోతే తిరిగి పరిస్థితి ఇంతే కదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎం.ఎల్.ఎ జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోక్యం చేసుకుని మురుగుకాలవల్లో పూర్తి స్థాయి పూడిక తీసేలా మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశ్రామిక రంగాన్ని అగ్రగామి చేస్తాం

ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

పారిశ్రామిక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపు తామని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను బుధవారం చైర్మన్ దేగల మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ తో ఆయన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికరంగ, ఏపీ ఐడీసీ పరిస్థితిపై చర్చించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పారిశ్రామిక రంగం కుదేలై అయిపోయిందని, కార్పొరేషన్లు నిరుగారిపోయాయని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రతి జిల్లాలో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు తగిన ప్రణాళికను సిద్ధం రూపొందిస్తున్నట్లు దేగల ప్రభాకర్ చెప్పారు.

రాజధానితో తాడికొండకు వైభవం

మినీమహానాడులో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని అమరావతిని తాడికొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం వల్ల నియోజకవర్గానికి ఒక వైభవం వచ్చిందని ఎమ్మెల్యే తెనాలి తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. గుంటూరులోని జిల్లా టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మినీ మహానాడులో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి కి పునాదులు వేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవబోతుందన్నారు. తాడికొండ నియోజకవర్గం అమరావతి రాజధాని ప్రాంతంలో ఉండటం మేము చేసుకున్న గొప్ప వరంగా భావిస్తున్నామని తెలిపారు. రాజధాని ఉద్యమంలో పాల్గొని వైసిపి అరాచక పాలన నుంచి అమరావతి కాపాడిన రైతులు పోరాటం మరువలేనిదన్నారు. కడపలో జరిగే మహానాడుకు పూర్తి ఎత్తున తరలి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పెహల్గాంలో తీవ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన 26 మంది ఆత్మశాంతి కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను ఏరివేసిందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూనే అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. అమరావతిలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతుంటే వైసిపి నేతలు బాధపడిపోతున్నారని అన్నారు. అమరావతి రాజధాని అభివద్ధిని ఆపడానికి వైసిపి అధినేత నానా తంటాలు పడుతున్నారని ఆరోపించారు. తాడికొండ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల టిడిపి మాజీ అధ్యక్షులు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ చిరు వ్యాపారాలకు చేయూత నందించారు. తుళ్లూరు,దొండపాడు, రాయపూడి గ్రామాలకు చెందిన చిరు వ్యాపార లకు 13 తోపుడు బండ్లు,టిఫిన్ బండ్లను బుధవారం పంపిణీ చేశారు.కిరణ్ కుమార్ ఆర్థిక సహకారంతో తోపుడు బళ్ళు అందించారని లబ్ధిదారులు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుళ్లూరు గ్రామ టిడిపి అధ్యక్షులు కాటా అప్పారావు, జమ్ముల అనిల్ కుమార్,జమ్ముల హరి కిరణ్ (బాబీ), మూల్పురి రాంబాబు, కొల్లి నరేంద్ర, చింతల శ్రీకాంత్, ఇందుర్తి శివుడు, అల్లాబక్షు,షేక్ సైదులు, తాళ్లూరి ధనయ్య, కారుమంచి రామ్మోహన్, గడ్డం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బళ్లు అందజేస్తున్న కిరణ్ కుమార్ తదితరులు

నీలం సంజీవరెడ్డి, టంగుటూరికి అవగాహన సంస్థ నివాళి

ప్రజాశక్తి - గుంటూరు

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి తరువాత కూడా తమ జీవితాల్ని ప్రజాసేవకు అంకితం చేసిన వారిలో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ముందు వరుసలో ఉంటారని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నీలం సంజీవరెడ్డి జయంతి, టంగుటూరి ప్రకాశం వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి సింగరయ్య మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి, టంగుటూరి ప్రకాశంలు తాము నమ్మిన సిద్ధాంతాలకు నైతిక విలువలకు జీవితాంతం కట్టుబడి ఉన్నారని, అనుకున్నది సాధించేదాకా అవిశ్రాంతంగా శ్రమించే విశిష్ట వ్యక్తిత్వాలు వారివన్నారు. భారతదేశానికి ఆరవ రాష్ట్రపతిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా ఏకగ్రీవంగా నీలం సంజీవరెడ్డి ఎన్నికయ్యారని, పదవుల కోసం ఆయన ఏనాడు ఎగబాక లేదని, పదవులే ఆ మహా నాయకుడుణ్ణి వెతుక్కుంటూ వచ్చాయన్నారు. అదేవిధంగా 1948లో ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా పని చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు ప్రజల మనిషిగా ప్రజా నాయకుడిగా కీర్తి గడించారన్నారు. ఉపాధ్యాయ నాయకులు ఏ.వి రామారావు మాట్లాడుతూ భారత రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి తన రాజనీతిజ్ఞతతో ఎన్నో క్లిష్ట సమస్యలను ఎదుర్కొన్నారన్నారు. గ్రామ స్థాయి నుండి దేశాధ్యక్ష స్థాయికి ఎదిగిన సంజీవరెడ్డి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆంధ్ర కేసరిగా ప్రఖ్యాతి చెందిన ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు, త్యాగ శీలత, ఉదాత్త భావాలు నేటి యువత అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు ఫణీంద్ర, రమణ, సత్యన్నా రాయణలు తదితరులు ప్రసంగించారు.

ఉగ్రవాదం ఆధునిక కాలంలో అత్యంత క్రూరమైన ఆటవిక చర్య

జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - గుంటూరు

నాగరికత వెల్లి విరిసిన నేటి ప్రపంచంలో ఉగ్రవాదం అత్యంత క్రూరమైన ఆటవిక చర్య అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'భారతదేశానికి విషమ సమస్యగా మారిన ఉగ్రవాదం' అన్న అంశంపై పాల్గొన్న వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్టిసి అధికారి ఎల్. మురళీకృష్ణ మాట్లాడుతూ ఉక్రెయిన్ రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తుంటే మరో ప్రక్క ఇజ్రాయిల్ హమాస్ దాడులు గాజాను రక్తసిక్తం చేస్తున్నాయని, పాక్ ప్రేరణతో భారత్‌లో ఉగ్రవాదం ప్రబలి అమాయకులు కాల్చి చంపబడుతున్నారన్నారు. పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. ఉగ్రవాద సంస్థలకు ఊతమిచ్చే ఏ దేశమైనా తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇటీవల భారత్ జరిపిన ఆపరేషన్ సిందూర్ నిరూపించిందన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ఉగ్రవాదం నేడు కొంతమందికి ఉపాధినిచ్చే ముడి సరుకుగా మారటం హేయమైన విషయమన్నారు. అమాయకుల ప్రాణాలు బలి కావడం తప్ప ఉగ్రవాదుల దుశ్చర్యల వల్ల ఒనకూడే ప్రయోజనం శూన్యమని ఇటీవలి ఉగ్రవాద సంస్థల దృష్టాంతాలు గమనిస్తే అర్థమవుతుందన్నారు. పాక్ రెచ్చిపోతే భారత్ నుండి ప్రతిఘటన తీవ్రంగా ఉంటుందని ఈ మధ్య జరిగిన పరిణామాలు నిరూపించాయన్నారు. ఈ చర్చలో విద్యావేత్త చంద్రయ్య, విశ్రాంత అధికారి మల్లేశ్వరరావులు ప్రసంగించారు.

రోడ్డు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో భవన నిర్మాణ కార్మికుడు మతి చెందగా మరోక కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సత్తెనపల్లి పట్టణం లోని గడియారపు స్థంభం సెంటర్లో బుధవారం ఉదయం జరిగింది. ఈ ప్రమాదంలో సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన ఉప్పుతల శ్రీనివాసరావు (48) అక్కడికక్కడే మతి చెందగా అదే గ్రామానికి చెందిన బూర్సు జాన్సన్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన భవననిర్మాణ కార్మికులు ప్రతి రోజూ భవననిర్మాణ కార్మికులు పనులకోసం సత్తెనపల్లి వస్తుంటారు. ప్రతి రోజూ పనులు కోసం సత్తెనపల్లి వచ్చారు గడియారపు స్థంభం సెంటర్లో రోడ్డు దాటుతుండగా పిడుగురాళ్ల నుండి గుంటూరు వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న శ్రీనివాసరావు మతి చెందాడు. వెనుక వున్న జాన్సన్ కు యడమ కాలు విరిగింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మతునికి భార్య ధనలక్ష్మి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని గౌతమ బుద్ధా రోడ్ మందాకిని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద గుర్తుతెలియని మృతదేహం గుర్తించినట్లు మంగళగిరి పట్టణ ఎస్సై రవీంద్ర నాయక్ తెలిపారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని మందాకిని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద 40 నుంచి 45 సంవత్సరాల మధ్య గల మగ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఆయన తెలిపారు. వ్యక్తి మెరూన్ రంగు గళ్ళ చొక్కా, బ్లూ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు ఆచూకీ తెలిసినవారు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ లో సంప్రదించవలసినదిగా పట్టణ ఎస్సై రవీంద్ర నాయక్ తెలియజేశారు.

మద్యం తాగుతున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి-ఈపూరు

రొంపిచర్ల మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సిఐ డి వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు ఉంటా యన్నారు. మద్యం దుకాణాలలో ధరలు తెలుసు కునేందుకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు.తనిఖీలలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కె శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్ డ్రైవర్‌పై యువకుల దాడి

ప్రజాశక్తి - మాచర్ల

ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావుపై దాడి చేస్తున్న యువకులు

ఆర్టీసీ బస్ డ్రైవర్ శ్రీనివాసరావుపై నలుగురు యువకులు దాడిచేసిన సంఘటన పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో బుధ వారం రాత్రి చోటు చేసుకొంది. మార్కాపురం నుంచి మాచర్ల వస్తున్న ఆర్టీసీ బస్సు పట్టణశివారులోని శ్రీశైలం రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బస్సు ఆపి ప్రయాణికులను దించుతున్న సమయంలో పట్టణానికి చెందిన నలుగురు యువకులు మద్యం మత్తులో బస్ డ్రైవర్ కొత్తపల్లి శ్రీనివాసరావుతో ఘర్షణకు దిగి, దాడి చేశారు. నలుగురు యువకులు మూకుమ్మడిగా పిడిగుద్దులు గుద్దుతూ, క్రిందపడేసి దాడి చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

శిబిరం వద్ద మాట్లాడుతున్న సిలార్ మసూద్

సమస్య పరిష్కారమయ్యే వరకూ ఆందోళన

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఉద్ఘాటన - 63వ రోజుకు నిరసన - యంత్రాంగం స్పందించాలని డిమాండ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళనను బహుముఖ రూపాల్లో కొనసాగించి తీరుతామని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఉద్ఘాటించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట పురపాలక సంఘం కార్యాలయం ఎదుట వారు చేపట్టిన నిరసన బుధవారానికి 63వ రోజుకు చేరుకుంది. తమ ఆందోళనపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికీ స్పందించకపోవడంపై కార్మికులు ఆవేదన వెలిబుచ్చారు. యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ ఆప్కాస్‌లోని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో ఉన్న మిగతా కార్మికులకు రూ.21 వేలు వేతనం ఇస్తూ అదే విధానంలో నరసరావుపేటలో ఆరేళ్లుగా పనిచేస్తున్న 40 మంది కార్మికులకు సగం రోజులకే వేతనాలు ఇచ్చారని, దీనిపై అడిగినందుకు విధుల్లో నుండి తప్పించారని తెలిపారు. దీనిపై రెండు నెలలకుపైగా శాంతియుత నిరసనలు తెలియజేస్తున్నా స్పందన లేదన్నారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూనే వారిని రోడ్డుపై పడేస్తున్నారని, వారికి ప్రత్యామ్నాయంగా రూ.700తో ప్రైవేటు వ్యక్తులతో పనిచేయిస్తున్నారని తెలిపారు. అదే వేతనాలు ఇప్పటికే పని చేస్తున్న వారికి ఇవ్వలేరా? అని ప్రశ్నించారు. కార్మిక చట్టాలు అమలులో ఉన్న ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక లేబర్ కోడ్‌లు అమలులోకి వస్తే కార్మికులు దుస్థితి మరింత దయనీయంగా మారుతుందని చెప్పారు.

జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకర్లు

మీడియా ప్రతినిధిపై దాడికి నిరసనగా ప్రదర్శన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాచర్లలో ఇటీవల న్యూస్ కవరేజ్ కోసం వెళ్లిన ఉమ్మడి గుంటూరు జిల్లా సాక్షి ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి అశోక్ వర్ధన్‌పై కొందరు దాడి చేయడం దారుణమని ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా విలేకర్ల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్ధార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. తొలుత స్థానిక కస్తూర్బా రోడ్డు నుండి నిరసన ర్యాలీ చేశారు. అనంతరం తహశీల్ధార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ధనుంజయకు వినతి పత్రాన్ని ఇచ్చారు. ప్రజలకు వార్తలు తెలియజేసే విలేకర్లకు రక్షణ కల్పించాలని, వారు విధులు సరిగా నిర్వహించుకునే వీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యూజె నాయకులు పి.భక్తవత్సలరావు, షేక్ జిలాని, ఎ.శేషగిరిరావు, షేక్ అబ్దుల్ సత్తార్, ఎం.కోటేశ్వరరావు, వాసు, కె.శ్రీనివాసరావు, షేక్ హసన్‌వలి, ఎస్.కె కరీముల్లా, డి.బుచ్చిబాబు, షేక్ ఖాజా ఇతర విలేకర్లు పాల్గొన్నారు.

రోగాలకు దగ్గరగా.. వైద్యానికి దూరంగా..

- పని ఒత్తిడితో అనారోగ్యం పాలవుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది
- రద్దయిన గత వైద్య సదుపాయాలను పునరుద్ధరించాలని వేడుకోలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పని ఒత్తిడి, మా.సిక సంఘర్షణల కారణంగా ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల కంటే తాము ముందుగా రోగాల బారిన పడుతుంటామని ఎపిఎస్ ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు. ఆర్టీసీలో సుమారు 48 వేల ఖాళీలున్నా వాటిని భర్తీ చేయని కారణంగా ఉన్న ఉద్యోగులు, సిబ్బందిపైనే పనిభారమంతా పడుతోంది. దీనికితోడు సంస్థను లాభాలబాట పట్టించడానికి అధికారులు నిర్దేశించే లక్ష్యాల సాధనా నిత్యం కళ్లముందు మెదులాడుతూ ఉంటుంది. వెరసి శారీరకంగా, మానసికంగా తీవ్ర ఒత్తిడిని వీరు ఎదుర్కొంటుంటారు.

చిలకలూరిపేట డిపోలో సుమారు 500 మంది ఉద్యోగులు ఉండగా 120 ఖాళీలున్నాయి. ఈ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశాక అప్పటి వరకూ వారికి అందుతున్న సదుపాయాలు రద్దయ్యాయి. గతంలో సంస్థ ఉద్యోగి, అతని భార్యకు వైద్యం పూర్తి ఉచితంగా లభ్యమయ్యేది. రూ.40 లక్షల వరకూ వైద్యం ఖర్చును సంస్థ భరించేదని, ప్రభుత్వంలో విలీనం తర్వాత ఇహెచ్‌ఎస్ (ఎంప్లాయీ హెల్త్ స్కీమ్) కింద ప్రతి ఉద్యోగి వద్ద వేతన స్థాయిని బట్టి ఏడాదికి రూ.225-300 వసూలు చేస్తూ కూడా పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు అందించడం లేదని ఉద్యోగులు, సిబ్బంది చెబుతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షలనూ డబ్బులుపెట్టి చేయించుకోవాల్సి వస్తోందంటున్నారు. గతంలో మాదిరి మెజారిటీ ఆస్పత్రులకు వెళ్లే వీలులేకుండా పోయిందని, ప్రధాన రోగాలకు మాత్రమే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోందని అంటున్నారు. స్టంట్ వెయ్యాల్సి వస్తే అందుకు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తమే చెల్లిస్తోంది. మిగతా మొత్తం

ఉద్యోగులే భరిస్తున్నారు. గతంలో రిటైర్డ్ ఉద్యోగులు వైద్య సదుపాయాల కోసం రూ.20 వేలు డిపాజిట్ చేస్తే భార్యాభర్తలిద్దరికీ చెరి రూ.2 లక్షల వరకు వైద్య సౌకర్యం కల్పించేవారు. ఉచితంగా మందులూ ఇచ్చేవారు. ఈ సదుపాయం ఇప్పుడు లేదు. తమను తీవ్ర అభద్రతకు గురిచేస్తున్న ఈ సమస్యలను ప్రస్తుత ప్రభుత్వమైనా పరిష్కరించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

పదో తరగతి ఫలితాల్లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన ఎస్.కోటీశ్వర్(592), టివిఎల్ రేణుక(587), సిహెచ్ సాయిగణేష్ (586)

'పది' ఫలితాల్లో సింధు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రభంజనం

నూరు శాతం ఉత్తీర్ణత - 62 మందికి 500 పైగా మార్కులు : చైర్మన్ కొత్త వెంకట రామకృష్ణ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కొత్త వెంకట రామకృష్ణ

నరసరావుపేట పట్టణంలో విద్యా రంగంలో విశేష అనుభవం గడించిన సింధు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఇటీవల 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. దీంతోపాటు 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 62 మంది 500కు పైగా మార్కులు సాధించారని చైర్మన్ కొత్త వెంకట రామకృష్ణ తెలిపారు. విద్యా సంస్థను స్థాపించిన దగ్గర నుండి తాము విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఒత్తిడి లేని బోధన అందిస్తున్నామని, విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని విషయాలపై అవగాహన పెంచుకునేలా తీర్చిదిద్దుతున్నామని వివరించారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

తమ పాఠశాలలో చదివే అందర్నీ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కొత్త వెంకట రామకృష్ణ అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ గొప్ప పౌరులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 10వ తరగతిలో తమ విద్యార్థి ఎస్.కోటీశ్వర్ 600 మార్కులకు గాను 592 మార్కులు సాధించినట్లు తెలిపారు. 3 దశాబ్దాల క్రితం నరసరావుపేట పట్టణం బరంపేటలో ప్రారంభించిన తమ విద్యాసంస్థ ఆరంభం నుండి 10వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తోందన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తమ విద్యార్థులు ఎందరో ఉత్తమ పౌరులుగా ఎదిగారని, జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారని తెలిపారు. లాభాపేక్షకు ప్రాధాన్యం ఇవ్వకుండా నరసరావుపేట పరిసర ప్రాంత పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ ఇస్తున్నామని, విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడాపోటీలు, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని వివరించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు.

ఇళ్ల మధ్యే రోజుల తరబడి చెత్త

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేట అన్నపూర్ణమ్మ హాస్పిటల్ వెనుక వైపు బజారులో ఇళ్ల మధ్య కొన్ని రోజులుగా చెత్త నిల్వలు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్న తాము దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారుల దీష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్న చెత్త చాలాదంటూ వేరే ప్రాంతాల్లోని చెత్తను కూడా తెచ్చి ఇదే ప్రాంతంలో వేస్తున్నారని మండిపడుతున్నారు. వానల నేపథ్యంలో చెత్త తడిచి దోమలు ఎక్కువవుతున్నాయని, తమకు డెంగీ, మలేరియా తదితర జ్వరాల భయం పట్టుకుందని చెబుతున్నారు. చెత్తను సత్వరమే తొలగించాలని కోరుతున్నారు.

15 ఏళ్ల అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ స్థలాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : చట్టపరమైన వ్యాపార కార్యకలాపాల నిర్వహణకు 15 ఏళ్ల అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ స్థలాలు కేటాయిస్తామని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు కోరారు. నరసరావుపేటలోని ఎపిఎస్ ఆర్టీసీ పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల పట్టణాల్లోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాల్లోని ఆర్టీసీ స్థలాల కేటాయింపుపై వివరాలను జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో పారిశ్రామిక వేత్తలకు శుక్రవారం వివరిస్తామన్నారు. త్వరలో నెల్లూరు జోనల్ కార్యాలయం ద్వారా టెండర్లు పిలుస్తామని చెప్పారు. పల్నాడు జిల్లాలో పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రక్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రానికి అనుమతులు

ప్రజాశక్తి - నరసరావుపేట టౌన్

పల్నాడు జిల్లాలో రోడ్డు సేఫ్టీ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో హెవీ వాహనాలు, లైట్ వాహనాలకు సంబంధించి శిక్షణివ్వడానికి నరసరావుపేటలోని రవాణా శాఖ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి కార్యాలయం పక్కనే ఏర్పాటు చేసిన శిక్షణ సంస్థకు అనుమతులను రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సంజీవ్ కుమార్ మంజూరు చేశారు. ఈ మేరకు పత్రాన్ని జిల్లా రహదారి భద్రత కమిటీ చైర్మన్ అయిన పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నుండి సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ కనకదుర్గ పద్మజాకు బుధవారం అందించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాలపై కమిటీ మెంబర్ సెక్రటరీ అయిన రోడ్లు భవనాలు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ రాజానాయక్ పలు అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రోడ్డు ప్రమాదాలు అత్యధిక శాతం డ్రైవర్ తప్పిదాల వల్ల జరగుతున్నవేనని వివరించారు. కలెక్టర్

మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఒక మహిళ స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి దానికి అనుగుణంగా స్కిల్డ్ డ్రైవర్లను తయారు చేయడానికి రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. రవాణా రంగంలో డ్రైవర్‌గా స్వయం ఉపాధికి మంచి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ సంజీవ్ కుమార్, రీసెర్చ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఓల సమ్మె

ప్రజాశక్తి - గుంటూరు

వైద్య ఆరోగ్య శాఖ గత ఆరు సంవత్సరాలనుండి గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్న సిహెచ్ ఓల సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతుంది. బుధవారంతో 24వ రోజుకు చేరుకుంది. గుంటూరు కలెక్టరేట్ ఎదుట ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ టి. ప్రవల్లిక, ట్రెజరర్ కె.సంధ్య మాట్లాడుతూ మూడు వారాలకు పైగా సమ్మె చేస్తున్నప్పటికీ సిహెచ్‌ఓల సమస్యలపై ప్రభుత్వం సాచివేత ధోరణి తగదని అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఉద్యోగ భద్రత కల్పిం పించాలని, ఎన్‌ఎచ్‌ఎమ్ ఉద్యోగులతో సమానంగా 23శాతం పెంపుదలతో వేతన సవరణ చేయాలనీ కోరారు. రెండు సంవత్సరాలుగా పేరుకుపోయి ఉన్న సమస్యల పరిష్కారం కొరకు సమ్మె బాట పట్టామని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. అలాగే క్రమబద్ధీకరణ, ప్రావిడెంట్ ఫండ్, పెండింగ్ ఇన్సెంటివులు విడుదల చేయాలని కోరారు. సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.



సిసి ఫుటేజీ

బ్యాంక్ ఆవరణలో బైక్ చోరీ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నగరం బైపాస్ రోడ్డు సమీపంలో ఇండియన్ బ్యాంక్ ఆవరణలో ఉన్న ద్విచక్ర వాహనం బుధవారం తెల్లవారుజామున చోరీ గురైంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు గుర్తుతెలియని ఇద్దరు దొంగలు ఒక బైక్ పై వచ్చి బ్యాంకు ఆవరణలో ఉన్న సయ్యద్‌కు చెందిన బైక్ ను అపహరించుకుపోయారు. ఇది ఇలా ఉండగా మంగళగిరి పట్టణంలో వివిధ ప్రాంతా లలో ఇటీవల ద్విచక్ర వాహనాలు చోరీలకు గురవు తున్నాయని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో వివిధ ప్రాంతాలలో పలు దొంగతనాలు జరగటంపై పట్టణ పోలీసులు నిఘా పెట్టటం లేదని స్థానిక ప్రజలు విమర్శలు చేస్తున్నారు. రాత్రి వేళలో ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని వీటిపై పట్టణ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి వాహనాలు చోరీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు పట్టణ పోలీసులను కోరుతున్నారు.

పారిశుధ్యంపై అశ్రద్ధ వహిస్తే సహించం

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

యాదవ బజార్లో స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతినిత్యం కృషి చేస్తున్నామని ఈ విషయంలో చిన్న చిన్న పొరపాట్లు జరిగినా సహించబోమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అధికారులను హెచ్చరించారు. గుంటూరులోని తొమ్మిదో వార్డు యాదవ బజార్లో బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్థానిక ప్రజలతో మాట్లాడారు. ప్రతి రోజూ తడి చెత్త, పొడి చెత్త వేరు చేస్తున్నారా ? ఉదయాన్నే వీధులను శుభ్రం చేస్తున్నారా ? ఇంటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందా? అని ఎమ్మెల్యే నసీర్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ పై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో అధికారుల తీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ ప్రాంతంలోని శానిటేషన్ సూపర్ వైజర్, వార్డు శానిటేషన్ సెక్రటరీలను వెంటనే సస్పెండ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనులు చేపడుతున్నారని అధికారులు అలసత్వం వహించి గొప్ప ఆశయానికి తూట్లు పొడిస్తే సహించబోమని ఆయన స్పష్టం చేశారు. నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ శానిటేషన్ ఇతర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్నామని, ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చుని సూచించారు. ఇప్పటికైనా అధికారులు విధుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.కార్పొరేటర్ యల్లావుల అశోక్, మీరావలి సాయి, బాజీ, కందుకూరి వెంకట్, కుర్రాకుల ప్రభాకర్, రియాజ్, కోట పిచ్చిరెడ్డి, మహంకాళి నరసింహారావు, జానీ, కనకారావు, వంగిన ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీగా ఉండాలి

ప్రజాశక్తి - తెనాలి

అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని సబ్ కలెక్టర్ సంజన సింహ చెప్పారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం వార్డు, గ్రామ సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న అధ్యక్షతన జరిగిన సమీక్షలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పట్టణంలో పర్యటించారని, అదేవిధంగా కొల్లిపరలో గ్రీవెన్స్ నిర్వహించారని చెప్పారు. ఆ సందర్భంగా ప్రజలు అర్జీల రూపంలో, ముఖాముఖి గా మంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు అవసరమైన సేవలను ఇంటి వద్ద అందించేందుకు ఏర్పాటు చేసిందని, దానికి తగిన విధంగా సిబ్బంది వ్యవహరించాలన్నారు. వార్డులలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ వార్డు పర్యటనలలో తనతో పాటు సచివాలయ సిబ్బంది కూడా విధిగా పాల్గొనాలన్నారు. నేరుగా ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ పరిణామాలు దోహదపడతాయన్నారు. తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతికత పెరిగిన నేపథ్యంలో వివిధ సంస్థలు అందించే సేవల తీరు ఎలా ఉందని ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, అదేవిధంగా సచివాలయాలనుంచి విస్తతమైన సేవలు అందిస్తున్న నేపథ్యంలో ఆ సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా సచివాలయాలలో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో ఉంచాలని, సిబ్బంది అందుబాటు వివరాలను కూడా పొందుపరచాలని సూచించారు. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వి లక్ష్మీపతి, వార్డ్ ఎమినిటి సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్, కమిషనర్, తహశీల్దార్

జోరువానలోనూ ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు బుధవారం ఉదయం నుండి జోరుగా కురుస్తున్న వర్షం లో సైతం దీక్షను కొనసాగించారు. దీక్షలో ఎస్ కే హిమంబి, వి లక్ష్మి, డి రమణ, ఎం శారద, రమణ కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యను కాలయాపన లేకుండా పరిష్కారం చేయాలని కోరారు. యాజమాన్యం, కార్మికులతో మంచి వాతావరణంలో చర్చలు జరిపి పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఎస్.కె కాసిం, ఎం గురవయ్య, సిహెచ్ పిచ్చయ్య, డి మాణిక్యరావు, పి ఏసుదాసు, ఎండి ఇస్మాయిల్, తుపాకుల నాగేశ్వరరావు, ఎన్ సుబ్బారావు, ఎం శివకుమారి, ఈ శారమ్మ, టి దుర్గ భవాని, వై రమాదేవి పాల్గొన్నారు.



నేడు జొన్న వీర్లంకయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి - తుళ్ళూరు

తుళ్లూరు ప్రాంతంలో 'కమ్యూనిస్టు వీర్లంకయ్య'గా గుర్తింపు పొందిన సిపిఎం నేత జొన్నకూటి వీర్లంకయ్య 4వ వర్ధంతి సభ గురువారం జరుగు తుందని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి బుధవారం తెలిపారు. తుళ్లూరులోని ఆయన స్వగృహం వద్ద సభ జరుగుతుందని అన్నారు. జొన్నకూటి వీర్లంకయ్య రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూ, గ్రామంలో రైతుగా వ్యవసాయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సిపిఎం అభివృద్ధి కోసం కృషి చేశారని రవి అన్నారు. తుళ్లూరు ప్రాంతంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, కార్మికులు, కూలీలు వీర్లంకయ్యకు ఎంతో గౌరవం ఇచ్చేవారని అన్నారు. ప్రజల మన్ననలు పొందిన జన్నకూటి వీర్లంకయ్య నాలుగో వర్ధంతి సభలో సిపిఎం శ్రేణులు, ప్రజలు పాల్గొనాలని రవి కోరారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజను సత్కరిస్తున్న నన్నపనేని రాజకుమారి

నన్నపనేని రాజకుమారిని కలిసిన రాయపాటి శైలజ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మహిళలకు సమన్యాయం చేయటంలో ముందుంటానని, మహిళా సమస్యలపై ఉక్కు పాదం మోపుతానని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. బుధవారం ఐతానగర్ లోని మాజి మహిళ కమిషన్ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారిని కలసిన శైలజ విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన మహిళ కమిషన్ బాధ్యతలను చిత్తశుద్ధితో ఆచరిస్తానని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై చర్యలు వుంటాయని పేర్కొన్నారు. గతంలో మహిళా కమిషన్ చైర్మన్‌గా విధులు నిర్వహించిన నన్నపనేని రాజకుమారి ఆశీర్వాదాలు పొందటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నన్నపనేని ముకుందరావు, నన్నపనేని సుధాకర్, విజయలక్ష్మి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ ఆవుల చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొంకి మోహనరావు కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును బుధవారం టీడీపీ నాయకులు అందజేశారు. తాడేపల్లి పట్టణం అమరారెడ్డినగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త కొంకి మోహనరావు రోడ్డు ప్రమాదంలో జనవరి 17వ తేదీన మరణించారు. కొంకి మోహనరావు టీడీపీ సభ్యత్వం కార్డు కలిగి ఉన్నారు. దానితో ఆ కుటుంబానికి మంజూరు అయిన టీడీపీ సభ్యత్వ ఇన్సూరెన్స్ సొమ్ము రూ. 5 లక్షల చెక్కును స్థానిక నాయకులు మృతుని ఇంటివద్దకు వెళ్ళి అందించారు. కష్టకాలంలో టీడీపీ సభ్యత్వమే తమ కుటుం బానికి భరోసా అయిందని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా కుటుంబ పెద్దలా ఆదుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి ధారదాసు, సీనియర్ నాయకులు మండవ గోపాలరావు, అద్దంకి మురళి, కొయ్యగోర మల్లేశ్వరావు,బండి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్ బత్తుల వాణి ఎదుట బైండోవర్ అయిన చింతలతండా గ్రామస్థులు

పలువురు బైండోవర్

ప్రజాశక్తి - మాచర్ల

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూచనల మేరకు బుధవారం మాచర్ల ఎక్సైజ్, విజయపురిసౌత్ పోలీసులు చింతలతండా గ్రామంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎటువంటి నాటు సారా దొరకలేదు. ఆ గ్రామములోని పదిమంది అనుమానిత వ్యక్తులను మాచర్ల మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరిచి అండర్ సెక్షన్ 128 బిఎన్ఎస్ఎస్ చట్టం కింద బైండోవర్ చేయడమైనది. మాచర్ల ప్రొహిబిషన్ పరిధిలోని వెల్దుర్తి, మాచర్ల, దుర్గి, మండలములోని వివిధ గ్రామాలను నాటు సారా రహిత గ్రామాలుగా మార్చడానికి ప్రజలు సహకరించాలని మాచర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరమణ కోరారు.

కళా రత్న సేవా అవార్డుకు ఎన్నికైన కవి కమలరామ్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - వినుకొండ

మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో మే 31న త్యాగరాయగాన సభలో జరుగుతున్న కళా సాహితీ సేవ అవార్డులకు రచయిత జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు, జాషువా సమాఖ్య గౌరవ అధ్యక్షులు కమలా రామ్‌కి ఆహ్వానం పంపారు. కళా రత్న అవార్డుకి ఎన్నికైన కమలారామ్‌ని పలువురు కవులు, మిత్రులు, కళాకారులు, కళా సంస్థలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తనను అవార్డుతో గౌరవిస్తున్న మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారికి కమలారామ్ కృతజ్ఞతలు తెలిపారు.

మరియదాసును పరామర్శించిన పిన్నెల్లి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణం 30వ వార్డు చెందిన ఆలేటి మరియదాసు అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసు కొని పల్నాడు జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. మరియదాసు గృహంలో ఆయన్ని పరామర్శించిన పిన్నెల్లి ఆర్థిక సాయం అందించారు. త్వరగా కోలుకుంటారని, కుటుంబానికి తామంతా తోడుగా వుంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు బమ్మిరెడ్డి సుబ్బారెడ్డి తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని గారపాడు గ్రామంలో నాలుగు కొత్త ట్రాన్స్ఫార్మర్ లను బుధవారం ఏర్పాటు చేశారు. గత కొంతకాలంగా లో వోల్టేజ్ సమస్య తో ఆ గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రవీణ్ దఅష్టికి తీసుకెళ్లగా వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవి15 కె.వి ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు. ఒక్కొక్క ట్రాన్స్ఫారం ఖరీదు సుమారు రెండు లక్షలు ఉండవచ్చునని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు మండల టిడిపి అధ్యక్షులు రమేష్‌కు, గారపాడు నాయకులు సాగర్‌కు ప్రజల అభినందనలు తెలిపారు.

తగ్గుతున్న పొగాకు ధరలు.. ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నల్ల బర్లీ పొగాకు ధరలు రోజు రోజుకి దిగజారుతున్నాయి. దీంతో అరుగాలం కష్టంచి పంటను పండించిన రైతులు కనీసం పెట్టుబడి వస్తుందో.. రాదోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలో కేవలం 450/500 ఎకరాలలోనే పొగాకు సాగు చేసే రైతులు కంపెనీల ప్రోద్భలంతో 5000 వేల (నల్ల బర్లీ 4 వేలు, తెల్ల బర్లీ వెయ్యి ఎకరాలు) ఎకరాలు సాగుచేస్తు న్నారు. నల్లబర్లీ పోగాకును ధర గత ఏడాది రూ. 18 వేల రూపాయలు పలికింది. ఫిబ్రవరి నెలలోపే పంటను కంపెనీలు కొనుగోలు చేశాయి. అయితే ఈ సంవత్సరం మాత్రం దానికి విరుద్ధంగా ఉంది. మే అయిపోతున్నా ఇంతవరకూ ఒక్క కేజీ పంటను కొనుగోలు చేయలేదు. అందీకాక ప్రస్తుతం ధర కూడా పతనం అయ్యింది. దీంతో నల్ల బర్లీ పొగాకు సాగు చేస్తున్న లబోదిబోమంటున్నారు.

పొగాకు పొలం (ఫైల్)

జి.పి.ఐ. పొగాకు వెయ్యమని రూ.15 వేల రూపాయలకు కొంటామని జిపిఐ కంపెనీ నమ్మించి మొహం చాటేశాయని పసుమర్రు గ్రామ రైతులు స్థానిక రూరల్ పోలీసులను ఇటీవల ఆశ్రయించారు. ప్రస్తుతానికి రూ11,000 నుండి 12,500 రూపాయలకు మాత్రమే ధర మాత్రమే పలుకు తోంది. కంపెనీలు సిండికేట్ అయి ధరలు తగ్గిస్తున్నాయని రైతులు వపోతున్నారు. ప్రభుత్వం కంపెనీలకే మద్దతు పలకడంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు.

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదు : రైతు తమ్మిశెట్టి నాగేశ్వరరావు

నేను ప్రతి సంవత్సరము 45 / 50 ఎకరాల పొగాకు సాగును 30 సంవత్సరాల నుంచి సాగు చేస్తాన న్నారు. ప్రస్తుతము 35 ఎకరాల్లో నల్లబర్లి పొగాకును సాగు చేశానన్నారు. ఇటు వంటి దౌర్భాగ్య పరిస్థితి ఏ సంవత్సరం లేదన్నారు. నాకు 40 ఎకరాలకు ఐటిసి వారు బాండ్ ఇచ్చారని మధ్య మధ్యలో వాళ్ళ తాలూకు అధికారులు ఈ ఎరువులు వాడండి ఆ ఎరు వులు వాడండి అని సలహాలుసూచ నలు కూడా చేస్తూ వచ్చారన్నారు. ప్రస్తుతం 430 క్వింటాళ్ల పొగాకు ఉందన్నారు. కొనుగోలు గేటు పాస్ కోసం ఫోన్లు చేస్తుంటే ఎత్తలేని పరిస్థితుల్లో ఉన్నా రన్నారు..

మొదటి గ్రేడ్ పొగాకు కొంటామంటున్నారు : రైతు తమ్మిశెట్టి శ్రీరావమ్

నేను 7 ఎకరాలు సాగు చేశానని, అందులోనూ మొదటి గ్రేడ్ పొగాకును మాత్రమే కొంటాం అన్నారని రెండు మూడు గ్రేడ్లు ఎవరి కమ్మాలో తెలియటం లేదన్నారు. ఇప్పటికైనా కొనుగోలు చేస్తే రైతులకు నష్టాలు తప్పుతాయన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి రాజీవ్ గాంధీ

రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాలలో శాశ్వత వెలుగులు నింపిన వ్య క్తి రాజీవ్ గాంధీ అని రాష్ట్ర కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి గోవిందు శంకర శ్రీనివాసన్ అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం స్థానిక ప్రధాన కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం జరిగింది జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇంటూరి భవాని వెంకటేష్ అధ్యక్షత వహించారు. నాయకులు, కార్యకర్తలు రాజీవ్ గాంధి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం రాష్ట్ర యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ అద్దంకి అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ బడుగుల జీవితాల్లో వెలుగులు నింపారని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి దేశ ఆర్థిక అభివృద్ధికి బాటలు వేశారన్నారు. నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ, నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ నస్రుద్దీన్ జిల్లా కాంగ్రెస్ నాయకులు సాగి మల్లికార్జునరావు, కాటూరి కోటేశ్వరరావు ఎప్పాల అంజిరెడ్డి తాళ్లూరి నాగేశ్వరరావు రెడ్డెం నర్సి రెడ్డి నాదెండ్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బాజీ ఎడ్లపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాగి నరసింహారావు కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు కారు చోల స్వప్న కుమార్, షేక్ బాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో పాల్గన్న ఆలయ సిబ్బంది

నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం 31,30, 423

ప్రజాశక్తి - దుర్గి

దుర్గి మండలంలోని అడిగొప్పల నిదానంపాటి అమ్మవారి హుండీ ఆదాయం 31,30 423 రూపాయల హుండీ ఆదాయం వచ్చినట్లు దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు పత్రిక ప్రకటనలో తెలిపారు. బుధవారం భక్తుల సమక్షంలో హుండీని లెక్కించడం జరిగిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి పి.సైదమ్మ బాయ్ బంగారం 8 .000 గ్రాములు వెండి 0.384 గ్రాములు వచ్చిందన్నారు. గత 57 రోజులుగా భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు, కానుకలను సమర్పించడం జరిగిందన్నారు. పర్యవేక్షణ అధికారిగా పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్ కార్యనిర్వహణ అధికారి సిహెచ్ శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో హుండీని లెక్కించడం జరిగిందన్నారు హుండీ లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీగా పాలూరి

ప్రజాశక్తి - నకరికల్లు

వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా జాయింట్ సెక్రెటరీగా నకరికల్లు కు చెందిన పాలూరి రాజశేఖర్ రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు వైఎస్ఆర్‌సీపీ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎంతో కష్టపెట్టిన ఎన్ని కేసులు పెట్టిన జగన్ మోహన్ రెడ్డి నమ్మిన సిద్ధాంతం వైపు ఉంటామని తెలిపారు. తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వినుకొండ లయోలా ప్రాంగణంలో జరిగిన యోగ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్, సుభాష్‌చంద్రబోస్, దుర్గి, నాదెండ్లలో యోగలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ యోగా మాసోత్సవాలు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని పలు చోట్ల అంతర్జాతీయ యోగా మాసోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. లయోలా హైస్కూల్, ఎన్ఎస్‌పి సాయిబాబా గుడి ప్రాంగణంలో మొదటిరోజు జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ యోగా యొక్క ప్రయోజనాలు అపారమైనవి మరియు విస్తృతమైనవని అన్నారు. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల శారీరక బలం, సమతుల్యత మెరుగు పడతాయి అని తెలియజేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ షకీలా దస్తగిరి మాట్లాడుతూ యోగా వల్ల మొత్తం ఆరోగ్యం, మరియు శ్రేయస్సు, మానసిక స్పష్టత మెరుగుప డతాయని ఒత్తిడిని తగ్గించి జీవిత సవాళ్లు సులభంగా ఎదుర్కోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, పివి సురేష్, రెడ్డి నగేష్, యోగా గురువులు, మున్సిపల్ సిబ్బంది, యోగా సాధకులు పాల్గన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

మానసిక రుగ్మతలను తొలగించేందుకు యోగాసనాలు అత్యంత ప్రాముఖ్యత చెందుతాయని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం యోగాసనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జూన్ 21న యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులు మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించింది అన్నారు. యోగాసనాలలో అష్టాంగ యోగాసనాలు చాలా ప్రాముఖ్యత చెందాయని అన్నారు. ఎంఈఓ బెంజిమెన్ మాట్లాడుతూ యోగా పరిపూర్ణంగా సిద్ధించాలంటే మనసును ఏకాగ్రతతో నిగ్రహించుకున్న నాడే యోగాసనాల విలువలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి సత్యప్రసాద్ , గ్రామ సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జరుగుతున్న యోగాంధ్రా కార్యక్రమంలో నాదెండ్ల మండల కేంద్రంలో వివిధ శాఖల సిబ్బందికి యోగాపై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నాదెండ్ల మండల అభివఅద్ధి అధికారిని స్వరూప రాణి తాసిల్దార్ ఏవి రమణ మండల విద్యాశాఖ అధికారి కఅష్ణా రెడ్డి మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కనపర్రు ప్రధానోపాధ్యాయిని రాజ్యలక్ష్మి అనేక సూక్ష్మ వ్యాయామాలు ఆసనాలు పరిచయం చేశారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

బుధవారం చేబ్రోలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బాల్యవివాహాలు, బాల కార్మికులు, ఫోక్సో చట్టం నిరోధంపై మండల స్థాయిలో అధికారులకు అవగాహన సదర్స నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.ఉమాదేవి బుధవారం తెలిపారు. క్రాఫ్ జిల్లా సమర్వయకర్త కోలా సుకుమార్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి జీవో నెంబర్ 31ని కఠినంగా అమలు పరచాలని అన్నారు. బాల కార్మికులు మరియు బాలికలపై లైంగిక వేధింపులు గురించి ఫోక్సు చట్టం గురించి కార్యక్రమంలో అవగాహన కల్పించారు. 14 సంవత్సరాల వయసు నుండి 18 సంవత్సరాల వయసులోపు పిల్లలు ప్రమాదకరమైన పనులలో ఉండకూడదని అలా తివారిని పనిలో పెట్టుకున్న వారిపై కార్మిక శాఖ అధికారులు పోలీసు అధికారులు చట్టపరమైన చర్యలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, చేబ్రోలు పిహెచ్‌సి వైద్యాధికారులు మహిళ పోలీసులు పంచాయతీ కార్యదర్శులు క్రాఫ్ట్ సిఎస్‌డబ్ల్యూఓ అరుణ కుమారి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుకుమార్ కుమార్

అన్నదానం చేస్తున్న పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - చేబ్రోలు

నీకోసం మేమున్నామంటూ అనేక సేవా కార్యక్రమాలు సమాజానికి అందిస్తున్న మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణానికి చెందిన కీర్తిశేషులు బండారు శ్రీనివాస రావు కుమారుడు బండారు రవితేజ పుట్టినరోజు సందర్భంగా నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర మరియు ఓవర్ బ్రిడ్జి కింద ఉంటున్న పేదవారికి అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమల శెట్టి ఉమాశంకర్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన కుటుంబ సభ్యులు రవితేజ తల్లి చెంచులక్ష్మి కి హఅదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. కోట్ల విలువలు చేసే మన ఆస్తులు మనం పోయిన తరువాత వాటాలేసుకునే వారి కళ్లలో ఇంత సంతోషం వుంటుందో లేదో నాకు తెలీదు కానీ, కేవలం కొన్ని పదులు ఖర్చు పెట్టి చేసే ఇలాంటి సహాయాలవల్ల ఆ పేదవారి కళ్లలో చ్చుడగలగే ఆనందం, కఅత్జ్ఞతలు, మనం జీవితమంతా కష్టపడ్డ సంపాదనలకు కంటే మిన్న అయినది. జీవితం లో కొన్నిసార్లు ఇలా చేయడం వలన సంతోషం, సంతఅప్తి, మిగులుతుంది అన్నారు . కార్యక్రమాన్ని మా సంస్థ ద్వారా అందించిన తన్నీరు రవీంద్ర బాబు కూడా కృతజ్ఞతలు ఈ కార్యక్రమంలో పోలిశెట్టి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ఆక్రమణలు పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఆక్రమణలను తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ పరిశీలించారు. స్థానిక పాండురంగ పేట, ఇందిరానగర్ కాలనీలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ నెల 17వ తేదీన మంత్రి నాదెండ్ల పర్యటనలో ఆక్రమణల క్రమబద్దీకరణ అంశం స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రభుత్వానికి ఇబ్బందిలేని ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు తహశీల్దార్ పట్టణంలో పర్యటించి ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు అనుకూలమైన ప్రదేశాలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారుజ ఆయన వెంట వీఆర్వోలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

తిరుమల శెట్టి కొండలరావును అభినందించిన బీజేపీ నేతలు

ప్రజాశక్తి - మంగళగిరి

జైకపు సేన వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల శెట్టి కొండలరావును బీజేపీ నేతలు బుధవారం అభినందించారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ పంచుమర్తి ప్రసాద్, అందే శంకరరావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, తాడేపల్లి అధ్యక్షులు ఏసుబాబు, తుమ్మా శ్యామ్, యశోద కృష్ణ, మునగపాటి వెంకటేశ్వరరావు, రామకృష్ణ, తులిమిల్లి శ్రీనివాసరావు, పిల్లి నాగేశ్వరరావు తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు. జై కాపు సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమాటం అనిల్ బాబు, గుంటూరు జిల్లా యువజన అధ్యక్షులు సోమరాజు సాంబశివరావు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి సహకరించాలి

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ బుధవారం కోరారు. పెదకాకాని గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మికాంతం, వుయ్యూరు మాసమ్మ జ్ఞాపకార్థం గరికపాటి రమేష్ కుమారుడు గరికపాటి వరుణ్ దేవ్ బుధవారం దేవస్థాన నిత్య అన్నదాన పథకమునకు రూ.1,00,116/-లు మరియు వెండి బిందె మరియు వెండి గిన్నె విరాళం అందించినట్లు గోగినేని లీలా కుమార్ తెలిపారు.

వైట్ హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజు

మంగళగిరిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైట్ హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్సీ వీర్రాజు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైట్ హౌస (స్నాక్స్ స్టాటర్స్, ప్రైవేట్ థియేటర్, పార్టీ రూమ్స్)ను బుధవారం ఎమ్మెల్సీ సోము వీర్రాజు బుధవారం ప్రారంభించారు. అనంతరం వీర్రాజు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ఆహార పదార్థాలకు భిన్నంగా పోషక విలువలతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించేందుకు వైట్ హౌస్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు ఆర్డరు ఇచ్చిన స్వల్ప వ్యవధిలోనే తయారు చేసి ఆహారాన్ని అందించటం జరుగుతుందని సోము వీర్రాజు అన్నారు. పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్. డెవలప్మెంట్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలపల్లి శ్రీనివాస రావు, ఇసునూరు అనిల్ చక్రవర్తి, రమేష్, వైట్ హౌస్ టీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి వేడుకలు

తెనాలి, పెదకాకానిలో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజీవ్ గాంధీ వర్ధంతిని బుధవారం ఘనంగా జరిగింది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ దేశానికి సాంకేతికతను తీసుకువచ్చింది రాజీవ్ గాంధీనేనని అన్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంగళగిరి మండల అధ్యక్షులు కఅష్ణ చౌదరి, జిల్లా కాపు సాధికారిక చైర్మన్ రెమిడిశెట్టి హనుమంతరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు దర్శనపు శామ్యూల్, తాడేపల్లి మండల అధ్యక్షులు పఠాన్ సుభాని, నియోజకవర్గ మహిళా చైర్మన్ షేక్ మున్ని, నాగేశ్వరరావు,శివ,రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు చందు సాంబశివుడు రాజీవ్ గాంధి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సాంకేతిక రంగాన్ని దేశానికి పరిచయం చేసిన ఘనత రాజీవ్ గాంధీకే చెందుతుందన్నారు. దేశ ప్రధానిగా అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి పేదవారి అభ్యున్నతికి పాటుపడ్డారని చెప్పారు. ప్రధానిగా అతితక్కువ కాలంలోనే మృతి చెందడం బాధాకరమన్నారు.

ప్రజాశక్తి - పెదకాకాని

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34 వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జన్నల వెంకటరెడ్డి మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీరావలి, ఇల్లా కిషోర్, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక శాఖా గ్రంథాలయం నందు జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులను ప్రతి ఒక్క విద్యార్థి వినియోగించుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ కోరారు. బుధవారం సమ్మర్ క్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లడి సమ్మర్ క్యాంపులో ఎమి నేర్చుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులలో దాగి వున్న సఅజనాత్మకను వెలికితీసి, వారు భవిష్యత్తు లో ఉన్నత శిఖరాలుకు చెరుకోవటానికి ఈ సమ్మర్ క్యాంపులు దోహదపడతాయిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయం పెదకాకాని గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న సుబ్బరత్నమ్మ

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘ పరిధిలోని 15, 16 వార్డులలో బుధవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చిన మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగకు ప్రజలు, వ్యాపారులు సహకరించాల్సిందిగా కోరారు. కార్యక్రమం లో 15వ వార్డు కౌన్సిలర్ జి. కోటేశ్వరరావు, 16వ వార్డు కౌన్సిలర్ దివి.అనిత, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్దిదారులతో మంత్రి మనోహర్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. నియోజకవర్గం లో 14 మంది లబ్దిదారులకు మొత్తం రూ.14,45,642 పంపిణీ చేసినట్లు మంత్రి చెప్పారు. 11 నెలల్లో 134 మందికి రూ.1.78కోట్లు పంపిణీ చేశామన్నారు.

ఆర్‌విఆర్ బిఇడి కళాశాలకు న్యాక్ బి గ్రేడ్

ప్రజాశక్తి - గుంటూరు

ఆర్‌విఆర్ బిఇడి కళాశాలకు న్యాక్ 'బి' గ్రేడ్ లభించినట్టు కళాశాల కార్యదర్శి గద్దె మంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే నెల ఎనిమిది, తొమ్మిదవ తేదీలలో ఆన్లైన్ ద్వారా ముగ్గురు సభ్యుల బృందం పరిశీలించి, న్యాక్ గుర్తింపుని ఇచ్చారని తెలిపారు. కేవలం బి.యిడి. కోర్సును మాత్రమే నిర్వహిస్తూ, తాము ఈ గ్రేడ్‌ని సాధించామన్నారు. తమ కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడానికి కృషిచేసిన కళాశాల ప్రిన్సిపల్, సిబ్బందిని ఆయన అభినందించారు.

నీరు నిల్వ లేకుండా చూడండి

మూడు వంతెనలను పరిశీలించిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరంలోని 3 వంతెనల దగ్గర డ్రైనేజి సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి 3 వంతెనల దగ్గర పర్యటించి వర్షపు నీరు నిలబడకుండా తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ, శంకర్ విలాస్ ఆర్.ఓ.బి తరువాత గుంటూరు పశ్చిమ తూర్పు నియోజకవర్గాలకు అతి ముఖ్యమైన వారధిగా 3 వంతెనల మార్గం ఉందని, త్వరలో ఆర్.ఓ.బి పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ మళ్లింపుకు కూడా ఇదే మార్గం అవుతుందన్నారు. అటువంటి కీలకమైన ప్రాంతంలో రోడ్ల విస్తరణకు స్తల సేకరణ కూడా చేయడం జరిగిందన్నారు. కాని చిన్నపాటి వర్షానికి కూడా ఈ ప్రాంతం బురదతో ముంపు సమస్య రావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని, సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం మురుగు నిలవకుండా డ్రైన్ నిర్మాణం చేయాలని, స్తల సేకరణ జరిగిన ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అవుట్ ఫాల్ డ్రైన్ వెంట్ కూడా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న డ్రైన్లు మరియు కల్వర్టుల వద్ద సిల్ట్ ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యస్.ఈ నాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, ఈ.ఈ సుందరరామిరెడ్డి, డి.ఈ.ఈ లు హనీఫ్, నాగభూషణం ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పల్నాడు ఎస్‌పి పల్లెనిద్ర

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

పల్నాడుజిల్లా ఎస్ పి కంచి శ్రీనివాసరావు బుధవారం రాత్రి వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో పల్లెనిద్ర చేశారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఆయన గ్రామాలనుసందర్శిస్తున్నారు. ఇందులో భాగంగా ఫ్యాక్షన్ గ్రామమైన గుండ్లపాడు గ్రామంలో బస చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు వచ్చామని తెలిపారు. కొన్ని పోలీసు శాఖలోనూ,మరికొన్ని రెవెన్యూ ఇతర శాఖల పరిధిలో సమస్యలు పరిష్కరించాల్సిఉందన్నారు. గ్రామంలో అందరూ ఐకమత్యంతో సోదర భావంతో మెలగాలని, శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ఎవరు నడుచుకోరాదని, ప్రశాంత వాతావరణంలో జీవించాలని తెలియజేశారు. సైబర్ క్రైమ్స్ గురించి బ్యాంకు నందు జరిగే మోసాలు గురించి, ఆన్లైన్ మోసాలు గురించి వివరించి ఎవ్వరు వ్యక్తిగత సమాచారం ఇతరులకు తెలియజేయరాదని ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్ కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని తెలియజేశారు. మహిళలపై జరిగే నేరాలు గురించి, బాల్య వివాహాలు గురించి, దొంగతనాల గురించి వివరించి అందరూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు.

యోగాతో ఉపయోగాలపై ప్రజల్లో చైతన్యం

రోజుకు 30నిముషాలు కేటాయించండి : పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

జూన్ 21 వరకు ప్రచారం : గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరులో

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు యోగా మాసంగా పాటిస్తూ యోగా సాధనపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగ ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎ భార్గవ్ తేజ, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ , రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ , నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర , డిప్యూటీ మేయర్ సజీల , జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కే ఖాజావలి, ఆర్డిఓ శ్రీనివాసరావు, వివిధ యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్ చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ యోగాలోని వివిధ అంశాలపై జిల్లా నలుమూలలా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని , యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యోగాంధ్ర-2025 థీమ్‌తో నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు, మారథాన్ పరుగు, రంగోలి, విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించడం రంగాలకు చెందిన వ్యక్తులతో ప్రజలను యోగాకు సన్నద్ధం చేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప విద్య యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పిలుపునిచ్చారు. రోజుకు 30 నిమిషాలు యోగాకు కేటాయించడం ద్వారా మానసిక శారీరక ఆరోగ్యం మెరుగవుతాయన్నారు. బుధవారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా నెలరోజుల యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాన్ని స్థానిక డాక్టర్ కోడల శివప్రసాద్ క్రీడాప్రాంగణంలో 1000 మందితో యోగా చేయడం ద్వారా జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు మొబైల్ ఫోన్ల వినియోగం తగ్గించుకుని యోగా సాధన చేసి ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. యోగా సాధన చేయడం ద్వారా మానసిక బలహీనతలు, ఉద్వేగాలు, ఉద్రేకాలను అదుపులో ఉంచుకోవచ్చని ఎస్పీ కంచి శ్రీనివాస రావు తెలిపారు. యోగా సాధకులలో ఆత్మహత్యలు, అత్యాశతో అక్రమాలు చేయడం, దుర్బుద్ధితో వ్యవహరించడం కనిపించడం లేదన్నారు. యోగాంధ్ర వంటి సామూహిక యోగా కార్యక్రమం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి యోగాసనాలు వేయడంపై శిక్షణ ఇచ్చిన ప్రముఖ యోగా ప్రచారకులు కూనంశెట్టి వెంకట జనార్ధన్, యోగా బోధకులు ఆనంద రాముడు, డైట్ అధ్యాపకులు అజయ్ కుమార్ లకు శాలువాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ సత్కరించారు. డిఆర్వో మురళి, ఆర్డీవో మధులత, జిల్లా అధికారులు, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.

యోగా శిక్షకులను సత్కరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్.పి

ప్రతినెలా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాలు రూపొందించటాన్ని మరింతగా మెరుగుపర్చాలన్న ఉద్దేశ్యంతో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారులు ప్రతి నెల సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ శంకరన్ హాల్ లో జిల్లా ఇన్ ఛార్జి కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి , ఆర్డిఓ కే. శ్రీనివాస రావుతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి డాక్టర్ తాతా సేవాకుమార్, బిజెపి నుంచి వై.వి. సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బిళ్లా సునీల్ కుమార్, టిడిపి నుంచి ఓంకార్, జనసేన నుండి సీహెచ్ త్రినాధ్ రావు , సిపిఐ (మార్కిస్ట్) పార్టీ నుండి వై. కృష్ణ కాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ మాట్లాడుతూ సమావేశాల్లో రాజకీయ పార్టీలు తెలిపిన అంశాలు, సూచనలు, సలహాలను జిల్లా స్థాయిలో పరిష్కరించే వాటిని వెంటనే పరిష్కరించటం జరుగుతుందని, రాష్ట్ర స్థాయిలోను, పాలసీలకు సంబంధించిన అంశాలు, సలహాలపై చర్యల కోసం ఎన్నికల సంఘానికి పంపించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలలోని బిఎల్ఓ ల జాబితా అందించాలని కోరారు. అలాగే ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసిన వారిపై పోలీస్ స్టేషన్లలో కేసులు ఫైల్ చేయడం జరిగిందని, ఇంతవరకు చర్యలు తీసుకోలేదని , దీని విషయమై ప్రస్తుత పరిస్థితి తెలియజేయాలని కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల లోపు ఓటరు కార్డు ఆధార్ కార్డుకు అనుసంధానం చేయించాలని కోరారు. పోలింగ్ బూత్ లు పెంచడానికి చర్యలు తీసుకోవాలని , నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా మండల స్థాయిలో కూడా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. అలాగే బీఎల్వోలు క్లైమ్స్ వెరిఫికేషన్ కు వెళ్లేటప్పుడు బీఎల్‌ఏ లను కూడా తీసుకువెళ్ళేలా చూడాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన పలు అంశాలపై జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ మాట్లాడుతూ ఓటరు కార్డు ఆధార్ కార్డుకు అనుసంధానం అంశంపై ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి ఓట్లు, డబల్ ఎంట్రీ ఓట్లు , రాష్ట్రం దాటిపోయిన వారి ఓట్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బీఎల్వోలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్వోల జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలన్నారు. 2026 జనవరి 5 న ఓటరు జాబితా రూపొందించడం జరుగుతుందని , దాని ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్లు పెంచడానికి భవనాలను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే ఎన్నికల సంఘానికి పంపుతామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశంలో తెలిపిన అన్ని అంశాలను మినిట్స్ రూపంలో నమోదు చేసి వాటికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. గత సమావేశం మినిట్స్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరిగింది. సమావేశంలో ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, డీఆర్డిఏ పీడీ టీ.వి.విజయలక్ష్మి , ఏఈఆర్‌ఓలు గుంటూరు తూర్పు, పశ్చిమ , జీయంసీ డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాస రావు, సిహెచ్ శ్రీనివాస రావు, ప్రత్తిపాడు , తెనాలి, మంగళగిరి, పొన్నూరు తహశీల్దార్లు జి. కరుణ కుమార్, గోపాల కష్ణా, దినేష్ రాఘవేంద్ర, జియా ఉల్ హక్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్ తేజ